సాక్షి ఏలూరు

మంగళవారం । 30 । జూలై । 2024



చేపనారు.. సాగు ఉసూరు

చేపనారు ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిన ఉంగుటూరు మండలంలో బాదంపూడి మత్స్య కేంద్రం ఈ ఏడాది లక్ష్యాన్ని అందుకోవడంలో విఫలమైంది. 8లో ▸



కాంట్రాక్టు ఇంత లేటా !

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని కాంట్రాక్టు లెక్చరర్లు ఉద్యోగం రెన్యూవల్ కోసం రెండు నెలలుగా ఎదురు చూస్తున్నారు. 8లో ▸



వృద్ధురాలిపై దాడి

పాలకొల్లు నడిబొడ్డులో పట్టపగలే ఓ ఇంట్లో వృద్ధురాలిపై దాడి చేసి నగలు దోచుకున్నారు. బాధితురాలికి తీవ్రగాయాలయ్యాయి. 8లో ▸

న్యూస్‌రీల్

వరద బాధితులను ఆదుకోవాలి



వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తున్న అఖిలపక్షం నేతలు

వేలేరుపాడు: గోదావరి, పెద్దవాగు వరదల వల్ల సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకోవాలని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. వేలేరుపాడు మండలాన్ని యూనిట్‌గా తీసుకున్ని అన్ని గ్రామాల్లో వరద సాయం అందించాలని డిమాండ్ చేశారు. బియ్యం, నిత్యావసర వస్తువులను అన్ని కుటుంబాలకు అందించి ఆదుకోవాలని కోరారు. పది రోజులుగా పనులు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని, తక్షణ సాయం రూ.3 వేలు మండల వ్యాప్తంగా ఇవ్వాలని జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కె.అద్దయ్యకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకలు బాడిశ రాము, కారం దారయ్య, మడివి దుర్గారావు, ధర్ముల రమేష్, ఎస్‌కే గౌస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సుద్దగుంపులో అధికారుల నిర్బంధం

వేలేరుపాడు: తమ గ్రామాన్ని గోదావరి వరద చుట్టుముట్టి పది రోజులు గడుస్తున్నా ఏ ఒక్క అధికారీ తమను పట్టించుకోలేదని వేలేరుపాడు మండలంలోని సుద్దగుంపు గ్రామ గిరిజనులు సోమవారం గ్రామానికెళ్లిన అధికారులను నిర్బంధించారు. ఆ గ్రామానికి ఫ్లడ్ డ్యూటీపై వచ్చిన జీలుగుమిల్లి వీఆర్వో బుల్లబ్బులు, మరో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను గ్రామ గిరిజనులు రెండు గంటలపాటు నిర్బంధించారు. గ్రామంలో 30 గిరిజన కుటుంబాలున్నాయని ఇప్పటివరకు ఒక్క కుటుంబానికి కూడా వరద సాయం అందలేదని, కనీసం మంచినీటి ప్యాకెట్లు కూడా ఇవ్వలేదంటూ గ్రామ గిరిజనులు ఆందోళనకు దిగారు. గ్రామంలో పలువురు జ్వరాలు బారిన పడినా కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవని వాపోయారు. విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఇద్దరు అధికారులను నిర్బంధించారు. విషయం తెలిసిన తహసీల్దార్ చెన్నారావు, పోలీసులు గ్రామానికి వెళ్లారు. వారితో గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. కుక్కునూరు సీఐ శ్రీనివాసరావుపై గిరిజనులు తిరగబడ్డారు. సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో గిరిజనులు శాంతించి నిర్బంధించిన అధికారులను విడిచిపెట్టారు.

జేఏఓ కృష్ణవేణి బదిలీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈపీడీసీఎల్ ఏలూరు సర్కిల్ పరిధిలో ఏలూరు జూనియర్ అక్కౌంట్స్ అధికారిగా పనిచేస్తూ వివాదాస్పదంగా వ్యవహరించారని ఆరోపణలు ఎదుర్కొన్న బి.కృష్ణవేణిని బదిలీ చేస్తూ ఎస్ఈ పి.సాల్మన్‌రాజు ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణవేణిపై తన పరిధిలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్‌ను వేధింపులకు గురిచేయడం, దాంతో ఆయన ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడం వంటి ఆరోపణలు రాగా సంస్థ జనరల్ మేనేజర్‌ను విచారణకు ఆదేశించారు. వేధింపులు వాస్తవమని నివేదిక రాగా గతంలో ఆమెకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనిలో భాగంగా ఆమెను బదిలీ చేస్తూ సంస్థ చైర్మన్ అండ్ ఎండీ ఆదేశాలిచ్చారు. కృష్ణవేణిని చింతలపూడి సబ్ విద్యుత్ రెవెన్యూ కార్యాలయానికి బదిలీ చేశారు.

కొనసాగిన డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

ఏలూరు(మెట్రో): స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాలలో రెండో రోజు సోమవారం డిపార్ట్‌మెంటల్ పరీక్షలు కొనసాగాయి. సోమవారం ఉదయం 38 మంది అభ్యర్థులకు 31 మంది, మధ్యాహ్నం 65 మందికి 50 మంది హాజరయ్యారని ఏలూరు ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి తెలిపారు.

స్కూల్‌గేమ్స్ సెక్రటరీ నియామకానికి దరఖాస్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ సెక్రటరీగా 2024-25, 2025-26 విద్యా సంవత్సరాలకు పనిచేయడానికి ప్రభుత్వ, జిల్లాపరిషత్, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 2లోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

31న పాలిటెక్నిక్ స్పాట్ కౌన్సెలింగ్

పెంటపాడు: కన్వీనర్ కోటాలో మిగిలిపోయిన పాలిటెక్నిక్ సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్ ఈ నెల 31న నిర్వహించనున్నట్లు తాడేపల్లిగూడెం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఫణీంద్రప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. పాలిసెట్-24లో ర్యాంకు వచ్చి సీటు రాని వారు, టెన్త్ ఉత్తీర్ణులు కౌన్సెలింగ్‌కు అర్హులని పేర్కొన్నారు.

ఇసుక.. మస్కా

ఇసుకను మింగేసి.. ఉద్యోగులను ఇరికించి..

- ఇబ్రహీంపేటలో 5 వేల టన్నుల ఇసుక మాయం
- తెలంగాణకు భారీగా అక్రమ రవాణా
- తెలుగు తమ్ముళ్లే కీలక సూత్రధారులు
- వారిని వదిలి ఉద్యోగులపై అధికారుల ప్రతాపం
- 8 మంది ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు
- 3 లారీల సీజ్‌తో సరిపెట్టిన వైనం



ఈనెల 25న కుక్కునూరు మండలం ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్ వద్ద ఇసుక కొలతలు వేస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి,ఏలూరు: ఒకటి కాదు రెండు కాదు.. 5 వేల టన్నుల ఇసుక మాయమైంది.. అంటే సుమారు 250 లారీల ఇసుక కేవలం 20 రోజుల్లో మాయమైపోయింది. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అధికారిక ప్రభుత్వ అమ్మకాలైతే రాత్రి 7 గంటల నుంచి వేకువజాము వరకు టీడీపీ నేతల ప్రైవేట్ అమ్మకాల దందా.. ఇది కుక్కునూరు మండలం ఇబ్రహీంపేటలోని ఇసుక స్టాక్ పాయింట్‌లో పరిస్థితి. వందల లారీలు ఇసుక తరలిపోతుంటే అధికారులు హడావుడి చేస్తూ మూడు కేసులు నమోదు చేసి ప్రభుత్వ ఉద్యోగులదే తప్పు **అంటూ 8 మందికి షోకాజ్ నోటీసులు ఇచ్చి రాతపూర్వక వివరణ తీసుకుని మూడు లారీలు సీజ్ చేసి** చేతులు దులుపుకున్నారు. అయితే వందల లారీలు మాయం చేసిందెవరు.. వారికి సహకరించింది ఎవరు.. తెలంగాణలో ఏ ప్రాంతానికి పంపారు.. వచ్చిన లారీల నంబర్లు ఇలా ప్రతి అంశం స్టాక్‌యార్డులోని సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. అయినా ఇవేమీ పట్టించుకోలేదు. తహసీల్దార్ మొదలు ఉన్నతాధికా**రుల వరకు అందరికీ తెలిసినా షోకాజ్‌లతో ముగింపు పలకడం చర్చనీయాంశంగా మారింది.**

ఈనెల 8 నుంచి.. ఏలూరు జిల్లాలో ఈనెల 8వ తేదీ నుంచి ఉచిత ఇసుక పథకం పేరుతో ఇసుక విక్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం తెరదీసింది. జిల్లాలోని కుక్కునూరు మండలం ఇబ్రహీంపేట, వింజరం, ఉంగుటూరు మండలంలోని చేబ్రోలులోని స్టాక్ పాయింట్లలో లక్ష టన్నుల ఇసుక అందుబాటులో **ఉందని ఆర్భా**టంగా విక్రయాలు ప్రారంభించారు. **అయితే** వాస్తవానికి 77 వేల టన్నులే ఉంది. ఇబ్రహీంపేట, వింజరంలో టన్నుకు రూ.210, చేబ్రోలులో టన్నుకు రూ.538గా ధర నిర్ణయించారు. జిల్లాలో కుక్కునూరు మండలంలో ఇబ్రహీంపేట, దాచారం, వింజరం, వేలేరుపాడులో రుద్రమకోట-1, 2 పోలవరంలో డీసిల్ట్ పాయింట్లు ఉన్నాయి. అనుమతులు లేకపోవడం, వర్షాల కారణంగా ఈ రీచ్‌లు ప్రారంభించలేదు.

సీసీ కెమెరాలు పరిశీలించరా..

మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి ఉద్యోగులపై మండల స్థాయి నేతలు ఒత్తిడి తెచ్చి అక్రమ రవాణా సాగించారు. అయితే ఈ తతంగమంతా సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. తహసీల్దార్ మొదలు ఉన్నతాధికారుల వరకు ఎవరూ సీసీ కెమెరాలు పరిశీలించి బాధ్యులపై కేసు నమోదు చేసి రికవరీ చేయకపోగా.. ఉద్యోగులకు మాత్రం షోకాజ్ నోటీసులు ఇచ్చి వివరణ తీసుకున్నారు. తద్వారా అసలు దోషులుగా ఉండే అధికార పార్టీ నేతలను వదిలేశారు.

ఆదాయం నేతలకు.. అవమానం ఉద్యోగులకు..

తెలంగాణలో టన్ను ఇసుక ధర రూ.950లు అదే కుక్కునూరులో టన్ను రూ.210లు మాత్రమే. భారీగా వ్యత్యాసం ఉండటంతో ఇదే ఆదాయ వనరుగా మలుచుకున్నారు. మండలంలో కీలక టీడీపీ నేతల కన్నుసన్నల్లో కొందరు సిండికేట్‌గా మారి తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం, సత్తుపల్లి, అశ్వారావుపేటతో పాటు పలు ప్రాంతాల్లో సుమారు 250కు పైగా లారీల్లో అక్రమంగా ఇసుకను తరలించి లక్షల్లో గడించారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్టాక్ యార్డులో లారీల నంబర్లు నోటు చేసుకుని వినియోగదారుడి అవసరాన్ని చూపేలా వీఆర్ఓ ధ్రువీకరణ పత్రంతో ఇసుకను విక్రయించాల్సి ఉంది. అలాగే ఇదంతా సీసీ కెమెరాల నిఘాలో జరగాలి. అయితే పది రోజులపాటు సాయంత్రం పూట సీసీ కెమెరాలున్నా అడ్డగోలుగా దందాలు సాగించారు. ఈనెల 22న మూడు లారీల్లో ఇసుక తరలిస్తుంటే జిల్లా ఉన్నతాధికారులకు వచ్చిన సమాచారం మేరకు లారీలను సీజ్ చేసి లారీ డ్రైవర్లపై కేసులు నమోదుచేశారు. మూడు రోజుల తర్వాత 25న రెవెన్యూ, మైనింగ్, ల్యాండ్ సర్వే విభాగాల అధికారుల బృందం స్టాక్ పాయింట్‌లో కొలతలు వేసి నిల్వలు లెక్కకట్టారు. ఆ తర్వాత భారీ వ్యత్యాసాన్ని గుర్తించి ఇబ్రహీంపేట రీచ్‌లో విధుల్లో ఉన్న 8 మంది సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రీచ్ ప్రారంభంలో ఉన్న నిల్వ, అధికారికంగా జరిగిన విక్రయాలు, ప్రస్తుత నిల్వలను బేరీజు వేసి ఎంత మేరకు అనధికారికంగా వెళ్లిందనేది అంచనా వేశారు.

‘మీ కోసం’లో అర్జీల వెల్లువ

కలెక్టర్ వెట్రి సెల్వి



వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీ కోసం) కార్యక్రమంలో అర్జీలు వెల్లువెత్తాయి. ఏలూరు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన మీ కోసం కార్యక్రమంలో ప్రజల నుంచి 211 అర్జీలు స్వీకరించినట్లు కలెక్టర్ కె.వెట్రి సెల్వి తెలిపారు. అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆమె ఆదేశించారు. జేసీ పి.ధాత్రిరెడ్డి, ఇన్‌చార్జి డీఆర్వో ముక్కంటి, ఏలూరు ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ భాస్కరరావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- జంగారెడ్డిగూడెం పేరంపేటకు చెందిన గోలి నర్సిరెడ్డి తాను మే నెల 24న ధాన్యాన్ని విక్రయించినా ఇప్పటివరకు ప్రభుత్వం సొమ్ములు చెల్లించలేదని కలెక్టర్ వద్ద వాపోయారు.
- ద్వారకాతిరుమలకు చెందిన దివ్యాంగుడు కొండూరు సాయికృష్ణ తనకు పింఛన్ అందించాలని అభ్యర్థించారు. చేతి వేలిముద్రలు, ఐరిష్ పడని కారణంగా పింఛన్‌కు ఇబ్బందులు పడుతున్నానన్నారు.
- పంగిడిగూడెంకు చెందిన రంగారావు తమ భూమికి ఆన్‌లైన్‌లో వేరేవారి పేరు నమోదై ఉందని, దానిని తొలగించి తన పేరును నమోదు చేయించాలని కోరుతూ అర్జీ అందజేశారు.
- టి.నరసాపురానికి చెందిన గంధం సుజాత తన భూమిని వేరే వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకుని ఆన్‌లైన్ చేయించారని, ఆ రిజిస్ట్రేషన్ రద్దు చేసి తమ పేరుపై ఆన్‌లైన్ చేయించాలని అర్జీ అందజేశారు.

తవ్వేయ్.. తరలించేయ్



ముప్పినవారిగూడెంలో అరుసుల కాల్వ నుంచి ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలంలోని పలు వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తవ్వి తరలిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ, నిఘా కొరవవడంతో టన్నుల కొద్దీ ఇసుక అక్రమంగా తరలిపోతోంది. కొందరు అధికారుల అండదండలతోనే ఇసుక అక్రమ రవాణా దందా సాగుతోందని పలువురు అంటున్నారు. మండలంలోని ముప్పినవారిగూడెం అరుసుల కాల్వ, గాడిదబోరు కాల్వల నుంచి ఇసుక రవాణా జరుగుతోంది. ట్రాక్టర్ ఇసుకను రూ.2,500 నుంచి రూ.3,000 వేల వరకు విక్రయిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఉచిత ఇసుక మాటున అక్రమ రవాణాకు తెరదీసినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముప్పినవారిగూడెం అరుసుల కాల్వ నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై కె.వెంకన్న హెచ్చరించారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

ఏలూరు (టూటౌన్): జిల్లాలో రైతుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఏలూరు కలెక్టరేట్ వద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు ధాన్యం బకాయి సొమ్ములు వెంటనే చెల్లించాలని, అన్నదాతా సుఖీభవ కింద పెట్టుబడి సాయం రూ.20 వేల చొప్పున అందించాలని డిమాండ్ చేశారు. భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని, ఎరువులు, విత్తనాలు ఉచితంగా ఇవ్వాలన్నారు. కౌలు రైతులందరికీ సాగుదారు హక్కుపత్రాలు అందించాలని, చింతలపూడి ఎత్తిపోతల పథకం, గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులకు న్యాయమైన పరిహారం అందించాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో జరిగిన మీకోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

వీడని వరద పోటు



రేపాకగొమ్ము వరద బాధితులను పడవపై తరలిస్తున్న దృశ్యం



రుద్రమకోట ముంపులోనే ఇళ్లు



నీటమునిగిన కన్నాయిగుట్ట రహదారి

- గోదావరి శాంతించినా.. తగ్గని శబరి
- పదో రోజూ జల దిగ్బంధంలోనే గ్రామాలు
- ముంపులోనే ఇళ్లు, రోడ్లు

వేలేరుపాడు: గోదావరి శాంతించినా శబరి నది ఉధృతి కొనసాగుతోంది. భద్రాచలం వద్ద ఆదివారం 51 అడుగులు ఉన్న నీటిమట్టం సోమవారం రాత్రి 9.30 గంటలకు 43.5 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. అయినా వేలేరుపాడు మండలంలోని గ్రామాల్లో ముంపు వీడటం లేదు. ఎడతెరపి లేని వర్షం వల్ల ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో శబరి ఎగపోటు వణికిస్తోంది. దీనికి తోడు సీలేరు, తాలిపేరు నదుల వల్ల గోదావరిలో వరద తగ్గడం లేదు. దీంతో వేలేరుపాడు మండలంలోని 29 గ్రామాలు పదో రోజూ జలదిగ్బంధంలోనే ఉన్నాయి. మండలంలోని వేలేరుపాడు సంత బజారు, చాకలి బజారు ప్రాంతాలు, రుద్రమకోట, రేపాకగొమ్ము, తిర్లాపురం గ్రామాల్లో కొన్ని ఇళ్లు ముంపు నుంచి తేరుకుంటున్నా పూర్తిగా వరద ప్రభావం తగ్గలేదు. బుర్రతోగు వద్ద మేళ్లవాగు బయటపడటంతో కన్నాయిగుట్ట, చాగరపల్లి, కొర్రాజులగూడెం గ్రామాలకు సోమవారం సాయంత్రం నుంచి రాకపోకలు మొదలయ్యాయి. వేలేరుపాడు నుంచి కొయిదా వెళ్లే దారిలో మేళ్లవాగు, ఎద్దెల వాగు, టేకూరు తదితర వాగుల వంతెనలు ముంపులోనే ఉన్నాయి. వేలేరుపాడు నుంచి రేపాకగొమ్ము, రుద్రమకోట వెళ్లే రహదారులు జలదిగ్బంధంలోనే ఉన్నాయి.

నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ ఆగ్రహం

- సర్పంచ్‌కు నోటీసులు
- విధుల నుంచి కార్యదర్శి తొలగింపు
- పూర్వ ఎంపీడీఓపై శాఖాపరమైన చర్యలకు సిఫార్సు



ద్వారకాతిరుమల పంచాయతీ కార్యాలయం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ వెట్రిసెల్వి సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్‌కు నోటీసులు జారీ చేయడంతో పాటు పంచాయతీ కార్యదర్శిని విధుల నుంచి తొలగించారు. అలాగే పూర్వ ఎంపీడీఓపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిధుల దుర్వినియోగంపై గ్రామానికి చెందిన నిమ్మగడ్డ అముక్త ఫిర్యాదు మేరకు ఈ ఏడాది ఫిబ్రవరిలో అధికారులు విచారణ చేశారు. పంచాయతీ కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు రూ.1,30,85,013లు, గతంలో ద్వారకాతిరుమలలో, ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలంలో ఎంపీడీఓ చేస్తున్న ఎస్.ఆశీర్వాదం రూ.18,73,538లు, సర్పంచ్ కుంటం స్వర్ణలత రూ.53,57,376లు మొత్తంగా రూ.2,03,15,927ల నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు అధికారులు తేల్చారు. అయితే ఇప్పటివరకు వీరిపై చర్యలు తీసుకోకపోవడంతో అముక్తతో పాటు గ్రామానికి చెందిన చిలుకూరి ధర్మారావు, తేలు వెంకటేశ్వరరావు కలెక్టర్ వెట్రి సెల్వికి మీకోసంలో ఫిర్యాదు చేశారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని డీపీఓ శ్రీనివాస్ విశ్వనాథ్‌ను ఆదేశించారు. కార్యదర్శి వెంకటేశ్వరరావును విధుల నుంచి తొలగించడంతో పాటు ఎంపీడీఓ ఆశీర్వాదంపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు. అలాగే చెక్ పవర్ ఎందుకు రద్దు చేయకూడదో, 6 నెలల పదవీ కాలాన్ని ఎందుకు రద్దు చేయకూడదో సంజాయిషీ ఇవ్వాలంటూ సర్పంచ్ స్వర్ణలతకు నోటీసు జారీ చేశారు. పంచాయతీ ఆర్థిక లావాదేవీలను వెంటనే నిలుపుదల చేయాలని ఈవోపీఆర్డీని ఆదేశించారు. పంచాయతీలో అవకతవకలపై తాను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను రాష్ట్ర సచివాలయం వద్ద కలిసి వివరించానని ధర్మారావు తెలిపారు.

సోలార్ ప్యానెళ్లకు సబ్సిడీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని కలెక్టర్ కె.వెట్రి సెల్వి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం సూర్యఘర్ యోజన కార్యక్రమం వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 3 కిలోవాట్ల సోలార్ విద్యుత్ ప్యానెల్స్ ఏర్పాటుకు రూ.78 వేల వరకు సబ్సిడీ ఇస్తారన్నారు. అలాగే సోలార్ రూఫ్ టాప్‌కు బ్యాంకులు రుణాలు ఇస్తాయన్నారు. విద్యుత్ ఎస్ఈ సాల్మన్ మాట్లాడుతూ జిల్లాలో లక్ష కనెక్షన్లు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. జేసీ పి.ధాత్రిరెడ్డి, ఇన్‌చార్జి డీఆర్వో ఎం.ముక్కంటి, ఆర్డీఓ ఖాజావలి పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై నిఘా : జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని కలెక్టర్ వెట్రి సెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లాలో ఉచిత ఇసుక విధానంపై అధికారులతో ఆమె సమీక్షించారు. స్టాక్ పాయింట్ల వద్ద 24 గంటలూ పనిచేసేలా సీసీ కెమెరాలు, సిబ్బంది ఉండాలన్నారు.

పింఛన్ల పంపిణీపై.. జిల్లాలో పింఛన్‌దారులకు ఆగస్టు 1న పింఛన్లు పంపిణీ చేయాలని కలెక్టర్ వెట్రి సెల్వి ఆదేశించారు. అందుబాటులో లేని లబ్ధిదారులకు రెండో తేదీన పంపిణీ చేయాలన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయం నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, ఎంపీడీఓలతో సమీక్షించారు.

క్లుప్తంగా

దుర్గమ్మకు సారె



సారె సమర్పించేందుకు విచ్చేస్తున్న ద్వారకా తిరుమల దేవస్థాన అర్చకులు, అధికారులు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నుంచి దుర్గమ్మకు ఆషాడ సారెను సోమవారం సమర్పించారు. అమ్మవారికి సారెను సమర్పించేందుకు ద్వారకా తిరుమల ఆలయ ప్రధాన అర్చకుడు భాను, ఏఈవో దుర్గారావు ఇంద్రకీలాద్రికి విచ్చేయగా, దుర్గగుడి ఈవో కేఎస్ రామరావు వారికి సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం సారెగా పట్టుచీర, పసుపు, కుంకుమ, పూజా సామగ్రిని ఆలయ అర్చకులకు సమర్పించారు. అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి పూజా సామగ్రికి అందజేయగా, ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం ఈవో కేఎస్ రామరావు ప్రసాదాలను, అమ్మవారి చిత్రపటాన్ని, శేషవస్త్రాలను బహూకరించారు.

ఐటీడీఏ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ



కేఆర్‌పురం ఐటీడీఏలో డ్యూటీ సమయంలో వీడియో గేమ్ ఆడుతున్న ఉద్యోగి

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురం ఐటీడీఏ కార్యాలయాన్ని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీవైఈఓ సెక్షన్‌లో ఓఎస్‌గా పనిచేస్తున్న సాయి కల్యాణ్ సెల్‌ఫోన్‌లో పబ్‌జీ ఆడుతూ ఎమ్మెల్యేకు కనిపించాడు. డ్యూటీ సమయంలో గేమ్స్ ఆడటంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న సాయి కల్యాణ్‌ను సస్పెండ్ చేయాలని ఇన్‌చార్జి పీఓ శ్రీనుకుమార్‌ను ఆదేశించారు. రాజానగరం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



రుస్తుంబాదలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకటరెడ్డి

నరసాపురం రూరల్: నరసాపురం మండలంలో సోమవారం రాత్రి రుస్తుంబాద, ఎల్బీ చర్ల గ్రామాల్లో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మరణించారు. రుస్తుంబాద జాతీయ రహదారిపై ఆగిఉన్న ఓఎన్జీసీ లారీని ఢీకొట్టడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి అక్కడికక్కడే మరణించారు. మృతుడిని పెనుమంట్ర మండలం జుత్తుగకు చెందిన వెంకటరెడ్డి (43)గా గుర్తించారు. వెంకటరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎల్బీచర్ల గ్రామంలో లేసు భవనం వద్ద సోమవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఆటో, బైక్ ఢీ కొన్న సంఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న గుబ్బల భాను ప్రకాష్(25) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రకాష్ మృతదేహాన్ని నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చేపనారు.. సాగు ఉసూరు

బాదంపూడి మత్స్య కేంద్రంలో కొనసాగుతున్న చేపనారు ఉత్పత్తి



తల్లి చేపలకు ఇంజెక్షన్ ఇస్తున్న మత్స్య శాఖ అధికారి, ఇన్‌సెట్‌లో సిమెంటు కుండీల్లో చేపనారు

ఉంగుటూరు: చేపనారు ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిన బాదంపూడి మత్స్య కేంద్రం ఈ ఏడాది లక్ష్యాన్ని అందుకోవడంలో విఫలమైంది. ఈ ఏడాది 20 కోట్లు నారు ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం నిర్ధారించింది. అయితే చేపకు అంతగా ధర లేకపోవడంతో నారు బయటకు వెళ్లే మార్గం లేక 10 నుంచి 12 కోట్ల మధ్యలో చేపనారు తయారు చేస్తున్నారు. పూర్వం ఇక్కడ తయారైన చేపనారు ఉమ్మడి రాష్ట్రంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు ఫాంలకు, రైతులకు సరఫరా చేస్తారు. జిల్లాలోని రిజర్వాయర్లకు ఉచితంగా అందచేయడం, ప్రైవేటు ఫాంలకు, రైతులకు విక్రయించడానికి ఉత్పత్తిచేసేవారు. అయితే తయారైన చేపనారుకు డిమాండ్ తగ్గడంతో ఈ ఏడాది ఆశాజనకంగా వ్యాపారం సాగలేదు.

జలాశయాల్లో వదులుతున్న నారు

చేపనారు ఉత్పత్తి జూన్ రెండో వారంలో మొదలు పెట్టారు. ఇప్పటికి 1.14 కోట్ల చేపనారు ఉత్పత్తి చేశారు. ఉత్పత్తి చేసిన చేపనారును కొవ్వలి, నర్సాపురం, తణుకు, ఏలూరు, కృష్ణా జిల్లా మాటూరు ప్రభుత్వ ఫాంలకు సరఫరా చేయాల్సి ఉంది. ప్రస్తుతం కొవ్వలి ఫాంకు అందజేస్తున్నారు. 3 నుంచి 4 అంగుళాల మేర కుండీల్లో, చెరువుల్లోను పెంచిన ఆ చిరు చేపను గోదావరి నదిలో, పోగుండ, జల్లేరు జలాశయాల్లో ఉచితంగా వదులుతారు. ఆ పిల్లలు పెద్దవై మత్స్యకారులకు జీవనోపాధి కల్పించేవి. తల్లి చేపలను ఈ ఏడాది ఓ టన్ను చేపలను కొనుగోలు చేశారు. ఈ చేపలు స్థానిక ఫాంలో ఉండే చెరువుల్లో పెంచుతూ చేపపిల్ల ఉత్పత్తికి ఉపయోగిస్తున్నారు.

ఆలస్యంగా ఉత్పత్తి ప్రారంభం

సకాలంలో కాలువకు నీరు రాకపోవడంతో ఆలస్యంగా చేపనారు ఉత్పత్తి ప్రారంభించాం. తల్లి చేపలు సేకరించి ఉత్పతి ప్రారంభించాం. స్టాకు నిల్వ చేసే పరిస్థితి తక్కువగా ఉండడం, తయారైన చిరుచేప బయటకు వెళ్లే మార్గం తగ్గిపోవడంతో.. సామర్థ్యం ఉన్నా లక్ష్యాలను అందుకోవడంలో ఇబ్బందులు పడుతున్నాం.

– నర్సయ్య, మత్స్య శాఖ ఏడీప

కాంట్రాక్టు ఇంత లేటా!



నూజివీడులోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల

నూజివీడు: రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని కాంట్రాక్టు లెక్చరర్లు ఉద్యోగం రెన్యువల్ కోసం రెండు నెలలుగా ఎదురు చూస్తున్నారు. లెక్చరర్ల పోస్టులు భర్తీ చేయనప్పటికీ రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల మనుగడను కాపాడుతున్న కాంట్రాక్టు లెక్చరర్ల ఉద్యోగాలను రెన్యువల్ చేయడంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. వేసవిలో అడ్మిషన్ల కోసం ఇంటింటికి తిరిగి జూనియర్ కళాశాలలకు అడ్మిషన్లు తీసుకొచ్చిన తమ కాంట్రాక్టును రెండు నెలలు కావస్తున్నా ఇంత వరకు రెన్యువల్ చేయకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో 3,618 మంది కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లు ఉన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత వీరి వేతనాలు రూ.27,100 నుంచి రూ.37,100కు ఆ తరువాత రూ.57,100కు పెరిగాయి. ప్రభుత్వ కళాశాలలకు పిల్లలను పంపని ఈ రోజుల్లో సైతం పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నేడు వందలాది మంది విద్యార్థులు చదువుతున్నారంటే కాంట్రాక్టు లెక్చరర్ల కృషితోనే చేరుతున్నారు. ఏటా మే నెలలో కాంట్రాక్టు లెక్చరర్లు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్లకు వెళ్ళి తమ కళాశాలలో చేరితే లాభాలను వివరించడమే కాకుండా, పిల్లల భవిష్యత్‌కు తమది బాధ్యత అని భరోసా ఇవ్వడంతో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఇంత చేస్తున్నా తమ కాంట్రాక్టును రెన్యువల్ చేయడంలో ప్రభుత్వం జాప్యం చేయడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంతవరకూ జీతాలు లేవు

ప్రతి విద్యాసంవత్సరంలో వీరి కాంట్రాక్టు జూన్ లోనే రెన్యువల్ అవుతుండగా ఈ సంవత్సరం జూలై నెల ముగుస్తున్నప్పటికీ ఇంతవరకు రెన్యువల్ చేయలేదు. వీరికి జూన్, జూలై నెలల వేతనం ఇంతవరకు రాలేదు. రెన్యువల్ చేయనప్పటికీ కాంట్రాక్టు లెక్చరర్లు కళాశాలలకు వెళ్ళి తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంత చేస్తున్నా వీరిపట్ల ప్రభుత్వం నిర్దయగా వ్యవహరించడంపై తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో సైబర్ నేరాలపై ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఉందని... ప్రజలు సైబర్ నేరగాళ్ళ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వేదిక మీ కోసంలో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని పరిష్కరించేందుకు సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సుమారు 60 మంది ఎస్పీకి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జీ స్వరూపరాణి, డీఎస్పీ ఈ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు



అరెస్టు చేసిన నిందితుడితో పోలీసు అధికారులు

కొయ్యలగూడెం: బిలిమిల్లి గ్రామంలో హత్యకు సంబంధించి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై జీజే విష్ణువర్ధన్ సోమవారం పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుట్టాయిగూడెం మండలం రాజానగరం గ్రామానికి చెందిన కొమరం శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ నెల 27న దిప్పకాయలపాడు పంచాయతీ బిల్లిమిల్లి గ్రామంలో సోదెం వెంకటేష్ హత్యకు గురైన సంగతి తెలిసిందే. నిందితుడు శ్రీనివాస్ కొంతకాలం క్రితం బిల్లిమెల్లికి కూలీ పనుల కోసం వచ్చాడు. ఆ సమయంలో మృతుడి మేనల్లుడితో నిందితుడి భార్య చనువుగా ఉండటంపై శ్రీనివాస్ అభ్యంతరం తెలిపి మందలించాడు. అయినప్పటికీ ఇద్దరి మధ్య సంబంధం కొనసాగడంతో పెద్దల మధ్య తగువు పెట్టారు. కుల పెద్దలు శ్రీనివాస్ భార్యను మందలించి శ్రీనివాస్‌తో పంపి వేయగా కొద్ది రోజులకు మళ్ళీ ఆమె మృతుడి మేనల్లుడి వద్దకు వచ్చేసింది. అయితే వెంకటేష్ వల్లే తన భార్య తనకు దూరమైందని శ్రీనివాస్ కక్ష పెంచుకున్నాడని.. వెంకటేషు ఒంటరిగా నిద్రిస్తుండగా కత్తితో నరికి హత్య చేశాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సులో చోరీ

ఉండి : తెలంగాణా రాష్ట్రం ఖమ్మంకు చెందిన భార్యాభర్తలు కాళ్ల మండలంలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన శుభకార్యంలో పాల్గొని బస్సులో తిరిగి వెళ్తుండగా వారి వద్ద ఉన్న బంగారీం చోరికి గురైంది. ఉండి మండలం కోలమూరు ఉప్పులూరు రోడ్డు వద్ద బస్సు ఎక్కిన భార్యాభర్తలను గుర్తించిన ఇద్దరు మహిళలు బస్సెక్కారు. కొద్దిసేపటికి వారు బస్సులో కనిపించలేదు. కొంతసేపటికి బ్యాగులో ఉండాల్సిన విలువైన బంగారు ఆభరణాలను కనిపించక పోవడంతో భర్తకు విషయాన్ని చెప్పింది. అప్పటికే బస్సు ఉంగుటూరు మండలం నారాయణపురం చేరుకుంది. అక్కడి నుంచి మళ్లీ ఉండికి వెళ్లారు. బంధువుల సహకారంతో కేసు పెట్టేందుకు ప్రయతిన్ంచగా కేసు నారాయణపురం పరిధిలోకి వస్తుందని పోలీసులు చెప్పడంతో వారంతా అక్కడికి వెళ్లారు. ఘటనపై ఇంకా కేసు నమోదు కాలేదు.

వృద్ధురాలిపై దాడి.. 8 కాసుల బంగారం చోరీ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు అనసూయ

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు నడిబొడ్డులో పట్టపగలే ఓ ఇంట్లో వృద్ధురాలిపై దాడి చేసి నగలు దోచుకున్నారు. పట్టణంలోని బొండాడ వారివీధిలో కలిశెట్టి అనసూయ నివసిస్తున్నారు. ఆమె భర్త రిటైర్డ్ ఉపాధ్యాయుడు కాగా కొంతకాలం క్రితం మృతి చెందారు. అనసూయ అనారోగ్యంతో ఉండడంతో భవనం కింద పోర్షన్‌లో ఉంటున్నారు. ఆమెకు సహాయకురాలిగా ఓ ఆయాను ఏర్పాటుచేశారు. అనసూయ కుమార్తె, అల్లుడు అదే భవనంలో పైన ఉంటున్నారు. సోమవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ఆయా భోజనం చేయడానికి మేడపైకి వెళ్లింది. అప్పటికే ఇంటి సమీపంలో ఇద్దరు వ్యక్తులు అటూ ఇటూ తిరుగుతున్నారు. ఆయమ్మ భోజనానికి వెళ్లిన వెంటనే ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు గేటు తీసుకుని లోనికి వెళ్లి అనసూయ పడుకున్న మంచం కింద ఉన్న రాయిని తీసి ఆమె తలపై కొట్టి ఆమె మెడలో ఉన్న బంగారు పూసల దండ లాక్కుని, ఇంట్లో మరికొన్ని బంగారు వస్తువులను చోరీ చేశారు. కిందకు వచ్చిన ఆయమ్మ రక్తపు మడుగులో ఉన్న అనసూయను చూసి కేకలు వేయడంతో అల్లుడు, కుమార్తె కిందకు వచ్చి చూశారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుమారు 8 కాసుల బంగారం చోరీకి గురైనట్లు బంధువులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని సందర్శించిన ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మీడియాతో మాట్లాడుతూ సీసీ ఫుటేజీ ద్వారా ఈ సంఘటనకు ఇద్దరు వ్యక్తులు కారణమని గుర్తించినట్లు చెప్పారు. ప్రత్యేక పోలీసు బృందం దర్యాప్తు మొదలుపెట్టింది. జాగిలం, క్లూస్ టీం ఆధారాలు సేకరించాయి. అనసూయను మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి తీసుకెళ్లారు. బాధితురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పోక్సో కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఒక వ్యక్తి తనపై అత్యాచారం చేశాడని బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతిబస్ తెలిపారు. విజయనగరం జిల్లా గజపతినగరానికి చెందిన బాలిక 10వ తరగతి పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటోంది. ఇన్‌స్టాలో జంగారెడ్డిగూడెంకు చెందిన రిషి అనే వ్యక్తి పరిచయమయ్యాడని, అతన్ని కలిసేందుకు బాలిక జంగారెడ్డిగూడెం రాగా, రిషి బస్టాండ్‌కు వచ్చి మళ్లీ వస్తానని బాలికకు చెప్పి వెళ్లిపోయాడన్నారు. తిరిగి రాకపోవడంతో, బస్టాండ్ వద్దే ఉన్న బాలికను బంటుమిల్లి శ్రీను తన ఇంటికి తీసుకువెళ్లాడన్నారు. ఈ క్రమంలో వేగవరానికి చెందిన రాజు పరిచయమై, ఊరు పంపిస్తానని చెప్పి జంగారెడ్డిగూడెంలో ఒక రూంలో ఉంచాడని, ఈ నెల 26న బాలికను కొట్టి, అత్యాచారం చేశాడన్నారు. బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైలు ప్రమాదంలో వృద్ధుడు మృతి

భీమడోలు: భీమడోలు రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని రైల్వే పోలీసులు సోమవారం గుర్తించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైలు ఢీకొట్టి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు చెబుతున్నారు. మృతుడి వయస్సు 60 నుంచి 65 ఏళ్ల మధ్య ఉంటుందని, 5.5 అడుగుల ఎత్తు, కోల ముఖం, తెలుపు జుట్టు, కుంకుమ రంగు చొక్కా, కాషాయం రంగు టవల్ కట్టుకుని ఉన్నాడన్నారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని శవ పంచానామా నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆచూకీ తెలిస్తే 9989219559 నెంబరుకు సమాచారం అందించాలని కోరారు.

జంగారెడ్డిగూడెంలో చైన్ స్నాచింగ్

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణంలో చైన్‌స్నాచింగ్ ఘటన చోటు చేసుకుంది. స్థానిక పాత ఎల్ఐసీ బిల్డింగ్ సమీపంలో ముగ్గురు మహిళలు సోమవారం రాత్రి నడిచి వెళ్తున్నారు. మోటార్‌సైకిల్‌పై వచ్చిన యువకుడు పసుపులేటి మమత మెడలోని మూడున్నర కాసుల చైన్ లాక్కుని పారిపోయాడు. సమాచారం అందుకున్న సీఐ పి.రాజేష్, ఎస్సై జి.జ్యోతిబస్‌లు ఘటనాస్థలానికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ మృతి

కైకలూరు: రోడ్డు సమీపంలో నడుచుకుంటూ వస్తుండగా.. స్కూటీ ఢీకొని చర్చి పాస్టర్ మరణించిన ఘటన పల్లెవాడలో సోమవారం జరిగింది. రూరల్ పోలీసుల వివరాల ప్రకారం కైకలూరు మండలం భుజబలపట్నంకు చెందిన ముచ్చుల రమేష్(63) పల్లెవాడ చర్చిలో పాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ప్రార్థన పూర్తి చేసుకుని వస్తుండగా ఆకివీడు నుంచి గుడివాడ వెళ్తున్న గూడపాటి నరేంద్రబాబు స్కూటీతో అతనిని ఢీకొట్టాడు. బలమైన గాయమైన పాస్టర్ రమేష్ అక్కడికక్కడే మరణించాడు. భార్య మార్తమ్మ ఫిర్యాదుపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దిగమర్రులో పిచ్చికుక్క దాడి

పాలకొల్లు అర్బన్: మండలంలోని దిగమర్రులో సోమవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. గ్రామంలో బీభత్సం సృష్టించింది. గ్రామంలోని కుక్కలను కరవడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. స్థానవరపు సీతమ్మ అనే వృద్ధురాలిని జబ్బ, భుజం, కాలిపైనా తీవ్రంగా కరచింది. బండి రామకృష్ణ కాలిపై బలంగా కరిచింది. రాపాక జాన్సన్‌పై దాడి చేసి చేతిమీద గాయం చేసింది. సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్‌పై కూడా పిచ్చికుక్క దాడి చేసింది. ఆయన తృటిలో గాట్లనుంచి తప్పించుకున్నారు. బాధితులంతా పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందారు. వృద్ధురాలు త్రుటితో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. స్థానిక యువత పిచ్చికుక్కను కొట్టి చంపారు.